కథ

**"ఇంక మేం వెళ్తొస్తాంరా అబ్బాయ్! నీ ఆరోగ్యం జాగ్రత్త. ఓవర్ టైములు, డిప్యుటేషన్లు అంటూ ఆ వూరూ ఈ వూరూ తిరక్కు. రోజూ డి.ఎ., టి.ఎ. వస్తుంది కదా అని డబ్బు కోసం కక్కుర్తిపడితే అసలు ఆరోగ్యం చెడి మొదటికే మోసం వస్తుంది.**

# ఓ నిజాయితీ కథ

అయినా నువ్వు కూడా వాడికి చెబుతూ ఉండాలమ్మాయి. వాడికేమయినా అనారోగ్యం వస్తే బాధపడేది నువ్వే'' మొదట కొడుకుతో, తరువాత పెద్ద కోడలుతో చెప్పిన పరమేశ్వరరావుగారు బయల్దేరడానికి ఉద్యుక్తులవడం చూసి మతిపోయిన పనైంది మనోరమగారికి.

''అదేమిటండీ! పెద్దాడిని, కోడలిని చూడాలన్నారు. మనవలు ఇంకా కాన్వెంటు నుంచి రాలేదు. వచ్చి ఇంకా గంట కూడా కాకుండానే చెప్పుల్లో కాళ్ళుపెట్టుకున్నట్టు ఈ తిరుగు ప్రయాణం ఏమిటండీ?'' అడిగారు మనోరమగారు.

''చూడు.. నీకు ఇంటి దగ్గరే చెప్పాను. పెద్దాడిని చూశాక ఆ సాయంత్రానికే చిన్నాడిని కోడల్ని చూడడానికి వెళ్లాలని. నువ్వు వస్తేరా లేకపోతే నా దారిన నన్ను పోనీ'' అన్నారాయన భార్యవైపు చిరాకుగా చూస్తూ.

''ఆ మాట నాతో ఎప్పుడన్నారండీ!'' అనబోయిన మనోరమగారు భర్త కళ్లల్లోని హుంకరింపును అర్థం చేసుకున్నదానిలా మారుమాట్లాడకుండా కూర్చున్న చోటు నుంచి లేచారు.

''ఇదుగోరా అబ్బాయి.. నీ వాటా పంట డబ్బు పదివేలు. అనవసరంగా డబ్బు దుబారా చేయకుండా మా మనుమలిద్దరి పేర చెరో అయిదు వేలు వెయ్యండి'' అంటూ పెద్ద కొడుకు రంగనాథ్‌కు వంద రూపాయల నోట్ల కట్ట అందించారాయన.

''వీళ్ల కాన్వెంట్‌లో అడ్మిషన్‌కి ఇది డొనేషన్‌గా కూడా సరిపోదు నాన్నగారు. ఇంకా డబ్బెక్కడ దాచి పొదుపు చేసేదీ? మీరు చెప్పినట్టే చెయ్యడానికి ప్రయత్నం చేస్తాను'' అన్నాడు రంగనాథ్.

''నాకు చాలా బాధగా ఉందత్తయ్యా! ఈ ఇల్లు మీది. మీ అబ్బాయి దగ్గర సంవత్సరానికి ఒక రోజు కూడా ఉండరు. తల్లిదండ్రుల్ని కొడుకుకు కాకుండా చేసిందనే అపఖ్యాతి నాకు రాకుండా ఓ నెల రోజులుండేలా రండత్తయ్యా!'' పెద్ద కోడలు శకుంతల అంది మనోరమతో మామగారికి వినపడనంత తక్కువ స్వరంతో.

''సర్లే! నాకంత అదృష్టం కూడానా తల్లీ. చూస్తున్నావుగా. ఆయన ఇమడలేని చోట అరక్షణం కాలు నిలువనీరు. రిటైరయ్యాక చాదస్తం మరీ ఎక్కువైపోయిందనుకో'' అన్నారామె అరచేత్తో నుదురు కొట్టుకుంటూ.

''ఏమిటే గుసగుసలు? బయల్దేరేదేమయినా ఉందా?'' ఆయన కంఠంలోని తీవ్రతను గమనించిన ఆమె మారుమాట్లాడకుండా సంచి చేతిలోకి తీసుకుంది.

శకుంతల అత్తగారికి బొట్టు పెట్టి, రవికల గుడ్డ, పళ్లు ఇచ్చి నమస్కరించింది. మరు నిమిషంలోనే ఆ దంపతులు రోడ్డెక్కారు.

''తాతగారు, బామ్మగారు పొలం పనులు హడావుడిలో వెళ్లిపోయారు. ఈసారి వచ్చినప్పుడు ఉంటారు అని మనుమలకి చెప్పరా అబ్బాయి'' తమను బస్సెక్కించగానికి వచ్చిన రంగనాథ్‌తో అన్నారాయన.

''అలాగే నాన్నా!'' అన్న రంగనాథ్ తమ్ముడి వూరు వెళ్లే బస్సెక్కించిన అమ్మానాన్నలకు వీడ్కోలు చెప్పి నిర్లిప్తంగా ఇంటిదారి పట్టాడు.

★ ★ ★

సుమారు నెలరోజుల తర్వాత మనోరమగారి దగ్గర నుంచి రంగనాథ్‌కి ఉత్తరం వచ్చింది. అందులో ఇలా ఉంది-

''చిరంజీవి పెదబాబుకి అమ్మ ఆశీస్సులు.

ఆరోజు నీ దగ్గర నుంచి నీ పెద తమ్ముడి ఇంటికి వెళ్లాము. అక్కడ కూడా మీ నాన్నగారు నన్ను గంటకన్నా ఎక్కువ వుండనివ్వలేదు. రైల్వే టి.సి.గా పనిచేస్తున్న నీ తమ్ముడు ఆరోజు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో డ్యూటీ కోసం బయల్దేరుతున్నాడు. వాడి వాటా పంట డబ్బు వాడికిచ్చేశాము. ఎన్ని పై డబ్బులు వచ్చినా ఈరోజుల్లో భార్య, భర్త ఉద్యోగం చేసుకోకపోతే సంసారం గడవటం కష్టం అని వాడి కష్టాలన్నీ చెప్పుకొచ్చాడు. వెంటనే బయల్దేరి నీ ఆఖరి తమ్ముడి ఇంటికి వచ్చేశాము.

కొత్తపల్లి ఉదయ బాబు

హైస్కూల్లో లెక్కలు మాస్టారుగా పనిచేస్తున్న నీ తమ్ముడి ఇంట్లో పదిహేను రోజులుండి ఇంటికి మొన్ననే చేరాం. రిటైరయిన ఈ ఆరు నెలలలో ఆయన మాటలను బట్టి నేను గమనించిందేమిటంటే నువ్వు, నీ పెద్ద తమ్ముడు ఏదో రకంగా పై డబ్బులు సంపాదిస్తున్నారు. అలాంటి అన్యాయపు అక్రమ సంపాదన అంటే ఆయనకు పరమ అసహ్యం. అవతల వాడు ఎంతో బాధపడుతూ తన అవసరం కోసం తప్పని పరిస్థితులలో ఇచ్చే ఆ సొమ్ము ఇవాళ కాకపోతే రేపయినా మనకు ఏదో ఒక రూపంలో దెబ్బ కొడుతుందని ఆయన నమ్మకం.

అందులో ఆయన పోస్టల్‌లో పనిచేయడం మరో కారణం. సబ్ పోస్టమాస్టర్‌గా ఉన్నంతకాలం ఏ సూపరింటెండెంట్ ఇన్‌స్పెక్షనుకు వచ్చినా చిల్లరతో సహా కచ్చితంగా క్యాష్ సరిపోయేది. ఇరవై బ్రాంచి ఆఫీసులకు హెడ్ అయి ఉండి కూడా ఆయన ఎట్టి పరిస్థితులలోనూ పబ్లిక్‌కి ఇబ్బంది కలిగిస్తే ఒప్పుకునే వారు కాదు. అలాగే నాకు టెలిగ్రాములు ఫోన్‌లో రిసీవ్ చేసుకుని రాయడం నేర్పారు. అప్పట్లో పోస్టల్, టెలిగ్రాఫ్ కలిసే ఉండేవి. ఆ టెలిగ్రామ్ తెలుగులో ఇంగ్లీషు పదాలను రాసి ఉంచితే ఆయన వచ్చిన వెంటనే రాత్రి సమయంలో పట్టుకెళ్లి ఇచ్చుకునేవారు. గుమాస్తా సెలవు పెడితే వంటపని అయ్యాక నాచేత కార్డులు, కవర్లు, పోస్టేజి అమ్మించేవారు. మనియార్డర్లు, రిజిష్టరు కవర్లు కట్టించుకోవడం నేర్పేశారు. కిటికీ దగ్గర పబ్లిక్ నిలబడి ఉండడం ఆయనకు ఇష్టం ఉండేది కాదు.

సిన్సియర్ అండ్ బెస్ట్ సర్వీస్‌మెన్ అని ఎన్నోసార్లు అధికార్ల మన్ననలు పొందారు. ఏ గుమాస్తా పని నేర్చుకోవాలన్నా ముందు మీ నాన్నగారి దగ్గరకు డిప్యుటేషన్ వేసి తిరిగి ట్రాన్స్‌ఫర్ చేసేవారు. అంత నిజాయితీగా ఉద్యోగం చేసిన ఆయన నీ ఇంట్లోను, నీ పెద్ద తమ్ముడి ఇంట్లోను ఎందుకు ఉండలేకపోయారన్నది తర్వాత అర్థం అయింది. ఏది ఏమైనా కష్టార్జితం కాని పైస మీ నాన్నగార్కి మాత్రం తృణప్రాయమే కాదు, కాలకూట విషంతో సమానం.

చిట్టిబాబు తన స్వయంశక్తితో ఉద్యోగం సంపాదించడమే కాదు, తను తీసుకునే ప్రతీ పైసాకి న్యాయం చేయాలి అనుకునే తత్వం ఉన్నవాడు. అందుకే వాడి దగ్గర ఉండడానికి మీ నాన్న ఇష్టపడ్డారు. నాకు మాత్రం కొన్నాళ్లు నీ దగ్గర కొన్నాళ్లు చిన్నాడి దగ్గర ఉండాలని ఉందిరా అబ్బాయి. మీ నాన్ననడిగితే 'నేను మూడో వాడి దగ్గరే ఉంటాను. నీకు కావలిస్తే నువ్వు వెళ్లి నీ కొడుకుల దగ్గర ఉండిరా, నాకు అభ్యంతరం లేదు' అన్నారు. నాకు


ఏంచేయాలో తోచక నీకు ఉత్తరం రాస్తున్నాను. నువ్వు, కోడలు ఆలోచించుకుని ఉత్తరం రాయండి. మీ ఉత్తరం కోసం ఎదురుచూస్తూ ఉంటాను. మనుమలకు ముద్దులు. నీ ఆరోగ్యం, కోడలి ఆరోగ్యం జాగ్రత్త!

ఆశీలస్సులతో- అమ్మ''

భర్త చేతిలో ఉత్తరం అందుకుని చదివిన శకుంతల దాన్ని మడిచి భర్త చేతికి అందిస్తూ అడిగింది-

''ఏం చేద్దామనుకుంటున్నారండీ?''

''ఇందులో ఆలోచించేదేమీ లేదు శకుంతలా! ఈ వయసులో నాన్నగార్ని అమ్మని విడదీసిన పాపం మనకు వద్దు. తనకు ఎంత చిన్న లోటు జరిగినా ఆయన సర్దుకోలేరు. అమ్మకి తోచదు. తమకన్నా చిన్న వాళ్లయిన తమ పిల్లలు ఎప్పుడూ వాళ్ల కళ్లకి అమాయకులుగానే కనిపిస్తారు. వాళ్లమీద ఏర్పరచుకున్న నమ్మకాలు వాళ్ల పిల్లలకు పెళ్లిళ్లయినా మార్చుకోలేరు. వారిద్దరికీ ఎప్పుడు ఉండాలనిపిస్తే అప్పుడు వస్తారు. చూడాలనిపించినప్పుడు సెలవు చూసుకుని మనమే వెళ్దాం'' అన్నాడు రంగనాథ్.



★ ★ ★

''ఏరా తమ్ముడు ఎప్పుడొచ్చావు? మరదలు, పిల్లలు కులాసానా?'' అడిగాడు రంగనాథ్ ఆఫీసు నుంచి లోపలికొస్తూ భార్యకు పళ్ల సంచీ అందించి, తమ్ముడు శుభాకర్‌ని ఉద్దేశించి.

''కులాసానేరా! ఆఫీసు పనిమీద హుబ్లీ క్యాంపుకి వెళ్లాను. ఈమధ్య నిన్ను వదిన పిల్లల్ని చూసి చాలా కాలం అయిందని ఓసారిలా వచ్చాను. ఏమిత్రా సంగతులు? నీ ఆఫీసు ఎలా వుంది? పై డబ్బులు ఏమన్నా వస్తున్నాయా?'' అడిగాడు శుభాకర్.

''ఏదోరా పర్లేదు. కూరగాయలకు సరిపోతున్నాయి. రోజూ డిప్యుటేషన్ మీద వెళ్లి వచ్చినందుకు వంద రూపాయలిస్తారు. ఏభై దారి ఖర్చులు మధ్యాహ్నం భోజనం, టీలకు సరిపోతుంది. మిగిలిన ఏభై పెట్టి కూరలు పళ్లు తెస్తాను. ఇంతకీ నీ జాబ్ ఎలా ఉంది? మరదలు ఏమంటోంది? పిల్లలు బాగా చదువుతున్నారా?'' అని అడిగాడు సోఫాలో కూర్చుంటూ రంగనాథ్.

''ఆ.. అంతా బాగున్నారు''

''ఇంతకీ నువ్వు భోజనం చేశావా?''

''లేదండీ ఎంత చెప్పినా వినకుండా అన్నయ్యతో కలిసి తింటాను అన్నాడు. వెళ్లి కాళ్లు కడుక్కురండి. వడ్డించేస్తాను'' అంది శకుంతల.

''అబ్బా! ఆ వంటింట్లో తీరిగ్గా పీట మీద కూర్చుని తినే ఓపిక నాకులేదు. తమ్ముడికి ఎక్కడ పడితే అక్కడ తినేసే అలవాటే కదా! ఇక్కడికే పళ్లాలలో పెట్టి తీసుకురా! ఏరా తమ్ముడూ''

''అవును వదినా! పోనీ ఇక్కడికే తెచ్చేయి. చేతుల్తో పళ్లాలు పట్టుకుని తినేస్తాం. నాకెలాగైనా అభ్యంతరం లేదు'' అన్నాడు శుభాకర్.

''రోజూ పూజాపునస్కారం చేసుకునే ఇల్లు నాయనా! అంటూ సొంటూ లేకుండా అలా ఎక్కడపడితే అక్కడ తినేస్తే ఆ 'లలితమ్మ'కు కోపం రాదూ''

ఎవరు? అన్నట్టు అన్నగారికేసి చూశాడు శుభాకర్.

''ఏవరేమిత్రా? ఆ 'లలితాదేవి'కి రోజూ సహస్రం చేస్తేగానీ ఈవిడ పచ్చి గంగ ముట్టదు. వింటోంది కదా అని నాన్నగారు వచ్చినప్పుడల్లా వాళ్ల బామ్మ పూర్వకాలంలో ఎలా మడీదడీ ఆచారాల్తో ఎలా పెరిగిందీ ఆయనను పెంచిందీ అంతా డైలీ సీరియల్‌లా చెప్తుంటారు. ఇంక ఈవిడ తు.చ.తప్పక ఆచరిస్తుంది. అదీ సంగతి. ప్లీజ్ శకూ! క్రింద ఒక్క మెతుకు పడకుండా నీ మడికి ఇబ్బంది రాకుండా తినిపెట్టే పూచీ నాది. సరేనా?''

''అదేంటన్నయ్యా! కింద మెతుకు పడితే ఏం? తీసి అవతల పారేస్తాం''

''నువ్వు నోరు ముయ్యరా భడవా! మెతుకు కింద పడిందంటే ఇప్పుడు ఈ గది అంతా కడగాలంటుంది''

''చాల్లే వదినా నీ చాదస్తం! అన్నం పొట్టలోకి వెళుతుంది కదాని పొట్టని మాటిమాటికీ కడుక్కుంటున్నామా?'' సాగదీసుకుంటూ అన్న శుభాకర్ తీరుకు శకుంతల నవ్వింది.

''చాల్చాల్లేవయ్యా! ఇద్దరూ కలిసి నన్ను ఆట పట్టిస్తున్నారుగానీ, మీ ఇద్దరి సంగతి నాకు చెబుతారేంటి? ఉదయం నాలుగు గంటలకు అలారం పెడితే అది కొట్టగానే ఈయన దాన్ని నొక్కేసి పడుకునే వారట. దాంతో తిక్కరేగి అత్తయ్యగారు చెంబుడు నీళ్లు ముఖం మీద పోస్తే లేచే వారట మీరిద్దరూ. మీ అమ్మగారు వస్తారేమో చూస్తూ ఉండమని ఈయన నిద్రపోయే వారట. ఆయన్ను

చూస్తూ నువ్వు నిద్రపోయేవాడివట. మళ్లీ అర గంట తర్వాత ఆమె వచ్చి చూస్తే లైటు, ఫాను వేసిన పాపానికి వాటి పని అవి చేసుకుపోతుండే వట. దాంతో ఒక మొట్టికాయ వేసి మళ్లీ లేపేవా రట. ఇక తప్పదని ఒక ప్రశ్న జవాబు గొణిగేసరికి తెల్లారిపోయేదట. మీ చదువుల నిర్వాకం నాకు తెలియనిదా. మీ సరదాల కోసం ఇంట్లో తాటాకు టపాకాయలు కడితే వాటిని కాలేజీ డస్క్ుల్లో పెట్టి పేల్చేవారట.

మామయ్యగారితో 'మీ వంటి క్రమశిక్షణగల ఉత్తమ వ్యక్తికి ఈ పిల్లలేంటండీ' అని లెక్చరర్లు తల కొట్టుకునేవారట.'' నడుమున ఒక చెయ్యి పెట్టు కుని మరో చేయి తిప్పుతూ చెప్పేస్తున్న శకుంతల ముందు ఆంజనేయుడిలా మోకాళ్ల మీద కూర్చుని రెండు చేతులు జోడించాడు శుభా కర్.

''వదినా ప్లీజ్ వదినా! ఆకలేస్తోంది. నువ్వు చెప్పినట్టే తింటాం''

''అలా రండి దారికి. అలా చూస్తారేంటండీ! టీవీ ఆన్ చేసి నోరు నొక్కేయండి. ఆ మూగ బొమ్మలు చూస్తూ అన్నం తిందురుగానీ'' అంటూ శకుంతల వంటింట్లోకి దారి తీసింది.

ఆమె వచ్చేసరికి అన్నతమ్ముళ్లిద్దరూ తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

''ఉద్యోగంలో చేరిన మొదట్లో రైల్లో ఖాళీగా ఉన్న బెర్త్ ఇస్తే వాడెవడో మొదటిసారి డబ్బు చేతిలో పెట్టాడన్నయ్యా. ఇదేంటయ్యా అని అడిగాను- మీ సహాయం మర్చిపోలేను. అసలు సీటు దొరుకుతుందనుకోలేదు. ఉంచు కోండి సార్ అన్నాడు. నాకు లంచం తీసుకోవడం అలవాటు లేదయ్యా అన్నాను. నేను ఇచ్చేది లంచం కాదు సార్, మీరు చేసిన సాయానికి కృతజ్ఞత. ఏ వస్తువైనా కొనిచ్చే టైం ఇది కాదు కదా! మీరు మళ్లీ మధ్యలో దింపేయకుండా ఉండడానికి సార్ అన్నాడు. నేను ఒకసారి బెర్తు ఇచ్చాక అలా అనే రకం కాదయ్యా అన్నాను. క్రితం ప్రయాణంలో ఎవరో టీసీ ఇలాగే బెర్తు ఇచ్చి తర్వాత ఎవడో ఎక్కువ డబ్బిచ్చేసరికి మధ్యలో దింపేశాడు సార్. అందుకే మీరిది తీసుకోక తప్పదు అన్నాడు. నేనూ అలాంటివాడినే అనిపించుకోవడం ఇష్టంలేక తీసు కున్నాను. ఆ తర్వాత అది అలవాటుగా మారిపో యింది.

మనల్ని లంచాలు తీసుకునే మనుషుల కింద జమకట్టి ఆఖరివాడు మాత్రం పరమ పవిత్రంగా సంపాదిస్తున్నట్టుగా వాడి దగ్గరే వుండి మన దగ్గర నాన్నగారు ఉండకపోవడం



నాకూ చాలా బాధేసిందన్నయ్యా! మన వృత్తిలో ఎంతో పవిత్రంగా ఉన్నా ఉండనివ్వని వాతావర ణంలో మనం బ్రతుకుతున్నప్పుడు మనల్ని నిందిస్తే ఏం ప్రయోజనం? మొన్న నాన్నగారు మా ఇంటికి వచ్చి గంట కూడా ఉండకపోతే నాకు చాలా బాధ అనిపించిందన్నయ్యా!'' శుభాకర్ దోసి లిలో ముఖం దాచుకుని ఒక్కసారి ఏడ్చేశాడు.

శకుంతల కంగారుపడిపోయింది. ఒక్కసారిగా అన్నం పళ్లాలు రెండు కింద పెట్టేసి ''బాబూ శుభాకర్! తప్పయ్యా ఏంటిది చిన్నపిల్లాడిలా? ఊరుకో! మీరైనా చెప్పండి'' అంది వణుకుతున్న కంఠంతో.

తమ్ముడి భుజాల చుట్టూ చేయి వేసి భుజం తడుతూ అన్నాడు రంగనాథ్-

''ఊరుకో శుభా! ఆయన ఉద్యోగం చేసినంత కాలం నిజాయితీగా చేశారు. అత్యుత్తమ ఆఫీసర్ అనిపించుకున్నారు. మనమూ నచ్చచెబుదాం! రేపు సంక్రాంతి పండగకు అందరమూ కలిసి అమ్మా నాన్నగార్ల దగ్గరకు వెళ్దాం. మన ఇళ్లకు కూడా రమ్మని అమ్మని అడుగుదాం. నువ్వు మాత్రం పండగకు భార్య, పిల్లలతో సహా మూడు రోజులూ ఉండేలారా! ఆఖరివాడికి కూడా ఉత్తరం రాస్తాను. సరేనా! భోజనం చేయి ఇప్పటికే బాగా లేట యింది'' అంటూ ఒక పళ్లెం అతనికి అందించాడు రంగనాథ్.

''అయాం సారీ వదినా! నేను ఇల్లు కడిగిపెడ తాను'' అన్నాడు శుభాకర్ కళ్లు తుడుచుకుని నవ్వు పెదవులపై పులుముకుంటూ.

''మనిషి మనసుకు అంటు ఉండకూడ దయ్యా! దానిని మనం కడుక్కోలేం. తండ్రి ప్రేమ కోసం ఆరాటపడే నువ్వు, మీ అన్నయ్య బంగారాలు. ఏదో నా చాదస్తంగానీ గదిదే ముందీ, నీళ్లతో కడిగితే మలినం పోతుంది. సరే భోజనం చేయి. అప్పడాలు తెస్తాను నీకసలే అవంటే ఇష్టం కూడాను'' అంటూ వంటిం ట్లోకి పరుగెత్తింది శకుంతల.

★ ★ ★

పండగ మూడు రోజులు కొడుకుల కబు ర్లతో, కోడళ్ల ముచ్చట్లతో మనుమల అల్లర్లతో ఎంతో సందడిగా గడిచిపోయింది పరమేశ్వరరావు గారికి. నాలుగో రోజు ఉదయం అందరూ బయల్దే రారు.


''వెళ్లొస్తాం నాన్నగారు మీ ఆరోగ్యం అమ్మ ఆరోగ్యం జాగ్రత్త'' అన్నాడు రంగనాథ్. 'అడుగు దామనుకున్న విషయం అడుగుతానన్నావు కదా, అడుగు' అన్నట్టు సైగ చేసిన శుభకార్ సంజ్ఞను అందుకుని మళ్లీ అన్నాడు రంగనాథ్-

''నాన్నగారూ! మీరు రిటైరయ్యాక చిన్న తమ్ముడి ఇంటికి వెళ్లి పదిహేను రోజులు పైగా వున్నారు. కానీ నా ఇంటికిగానీ పెద్ద తమ్ముడి

## నేనే బాస్‌ని

సినీతారలు తమ సినిమాల కన్నా వ్యక్తి గత జీవితంలో జరిగే సంఘటనలతో ఎక్కు వగా వార్తల్లోకి వస్తుంటారు. ఈ సంగతి ప్రియాంకాచోప్రాని అడిగితే 'ఏమో నాకేం తెలీదు. నేను కావాలని వివాదాల్లో ఇరు క్కోను. అలా అని నా మీద ఏమైనా రూమర్లు వచ్చినా అప్‌సెట్ అవ్వను. ఇండస్ట్రీలో వదం తులు సహజం. గ్లామర్‌తో ముందుకుసాగే బిజినెస్ ఇది. సినిమా తారలు ఏం చేస్తున్నారో అంతా ఆసక్తిగా గమనిస్తుంటారు. నా గురించి ఏం మాట్లాడినా అతిగా స్పందించి క్షమాపణలు చెప్పడం నాకిష్టం ఉండదు. నేనె వ్వరికీ జవాబివ్వాల్సిన అవసరం లేదు. నాకు నేనే బాస్‌ని. నా ఆత్మసాక్షి ప్రకారం నేను నడు చుకుంటాను' అంటూ ఎమోషనల్‌గా జవాబి స్తోంది ప్రియాంకాచోప్రా.

ఇంటికి గానీ రానేలేదు. మా ఇళ్లకు వచ్చి పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టకుండా వచ్చేసేటంత పాపం ఏం చేశామో మాకు అర్థం కావడంలేదు. మాకు వాడంటే అసూయ అని మాత్రం అనుకోకండి. అమ్మ మాకు ఉత్తరం రాసింది మాది నిజాయితీ లేని సంపాదన అని, లంచాలు తీసుకుంటున్నామని, ఆ కూడు తినలేనని మీరు అన్నారనే భావం వచ్చేలా. ఆ మాటకు మేము చాలా బాధ పడ్డాం. శుభాకర్ అయితే ఏడ్చేశాడు కూడా. సమాజంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల ప్రకారం మేము నడుచుకుంటూన్నాం. అంతేగానీ ఎవరినీ పీడించి మేము డబ్బు వసూలు చేయడం లేదు. ఇది మీరు అర్థం చేసుకుంటే చాలు. కాబట్టి మీరు మా ఇళ్లకు కూడా వచ్చి ఉంటే చాలా సంతోషిస్తాం'' అన్నాడు నెమ్మదిగా.




కుండబద్దలు కొట్టినట్టు సమాధానం చెప్పారు పరమేశ్వరరావుగారు.

''చూడబ్బాయ్! పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతోనే పోవాలంటారు పెద్దలు. నీతి నిజాయితీ వూపిరిగా బ్రతికిన జీవితం నాది. నేను మిమ్మల్ని కోరేదొక్కటే. నీతిగా నిజాయితీగా ప్రతీ పైసా కష్టపడి సంపాదించండి. అలా అని నాకు నమ్మకం కలిగిననాడు తప్పక మీ ఇంటికి వచ్చి ఉంటాను. నాకు మీరంతా సమానమే. మూడో వాడు టీచరుగా కష్టపడి పనిచేస్తాడు. అంటే మీరు చేయరని కాదు అర్థం. ఒక నెల రెండు వందల రూపాయలు డాక్టరుకు ఖర్చు పెడితే 'నేను ఎవరికో చదువు చెప్పడంలో లోపం చేశాను. అందుకే ఆ రెండు వందలు నాకు కాకుండా పోయాయి' అని వాడు నా ముందు ఫీలయ్యాడు. అది వాడి వృత్తి పట్ల బాధ్యతను తెలియచేస్తోంది. మీకూ ఆ బాధ్యత ఉందనే అనుకుంటున్నాను. నాకు అలా కష్టపడి సంపాదించిన డబ్బుతోనే తినడం ఇష్టం. నా వాదన మీకు పిచ్చితనంగా అనిపించవచ్చు. అందుకే నన్ను బలవంతం చేయకండి. నన్ను చూడాలనిపించినప్పుడు ఒక్కసారి వచ్చి చూసి వెళ్లండి. అంతే''

''అయితే ఇదేనా నాన్నగారూ మీ ఆఖరి మాట?'' కళ్లల్లో నీళ్ల చిప్పిల్లుతుండగా అడిగాడు రంగనాథ్.

''నాన్నగారు అంత కచ్చితంగా చెబుతూంటే ఇంకా ఇదేనా ఆఖరిమాట అంటావేంటన్నయ్యా! మనం తినే తిండి రక్తపుకూడు. మేము ఉద్యోగాలు వచ్చాక సమాజం మమ్మల్ని లంచగొండిగా మార్చితే మారిన వాళ్లం. కానీ మీ ఆఖరి కొడుకు ఉద్యోగం ఎలా సంపాదించాడో తెలుసా మీకు?''

''ఒరేయ్ శుభా కాస్త ఆవేశం తగ్గించుకోరా ప్లీజ్'' తమ్ముడిని బ్రతిమలాడుతున్నట్టు అన్నాడు రంగనాథ్.

''దయచేసి నన్ను ఆపకన్నయ్యా! చెప్పండి నాన్నగారూ, మీరు అమ్మ ఉత్తరదేశ యాత్రలకు వెళ్లినప్పుడు తమ్ముడికి ఉద్యోగం వచ్చింది మెరిట్‌లో అనికదూ మీ ఉద్దేశం. ఆనాడు వాడి కోసం మేము లంచాలు సంపాదించి కూడబెట్టిన అయిదువేలు ఇస్తే వాడికి ఉద్యోగం వచ్చింది. ఆ డబ్బు నేను అన్నయ్య పట్టుకెళ్లి మా చేతులతో మీడియేటర్ ద్వారా ఇంటర్వ్యూ కమిటీ చైర్మన్‌కి అందించాం. మాకు ఉద్యోగాలు వచ్చాక లంచం అనే మచ్చ మా మీద పడింది. కానీ మీ ఆఖరి అబ్బాయి ఉద్యోగం అనే వృక్షం లంచం అనే నీరు సాయంతో మొలకెత్తి పెరుగుతోంది. ఆ సంగతి మీకు తెలుసా?'' ఆవేశం పట్టలేక అరిచేశాడు శుభాకర్.

''ఏరా చిట్టిబాబూ! నిజమేనా'' మూడో కొడుకును చూస్తూ నూతిలోంచి మాట్లాడినట్టు అడిగారు పరమేశ్వరరావుగారు.

చిట్టిబాబు తలవంచుకున్నాడు అవునన్నట్టుగా.



## సలహా

ఇండస్ట్రీలో కొచ్చిన కొత్తలో ఎంతోమంది సలహాలు తీసుకుంటుంటారు తారలు. అయితే ఎక్కువగా వారి కుటుంబ సభ్యుల్నే వివిధ అంశాల్లో సంప్రదిస్తుంటారు. ఇది కొత్తేమీ కాదు. కానీ ఇదేదో ఎక్కడా లేని అంశం అన్నట్టుగా మలైకా అరోరా గురించి ఆమె సోదరి అమృతా అరోరా ఎన్నో సంగతుల్ని చెప్పుకొస్తోంది. 'మలైకా నాకు సిస్టరే కాదు. నా క్లోజ్ ఫ్రెండ్. నా కెరీర్ గురించే కాకుండా నా అందం గురించి కూడా ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. నన్ను తీర్చిదిద్దుతుంది. ఫ్యాషన్ అంటే మలైకాకా బాగా తెలుసు'అంటోంది అమృతా. ఈ ప్రశంసలు విన్న మలైకా ఉబ్బితబ్బిబవుతోంది.

సన్నగా కంపించిపోతూ గుండెలు చేత్తో పట్టుకుని గోడకు ఆసరా చేసుకుని అలాగే కింద కూలబడిపోయారు పరమేశ్వరరావుగారు.

''వాడేం చెబుతాడు నాన్నా! మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం'' శుభాకర్ స్థిరంగా అంటున్న మాటలు ఆయన చెవిన పడ్డాయోలేదో కానీ క్రమంగా నిర్జీవమవుతున్న నిశ్చలమైన ఆయన చూపుల కిరణాలు అనంత ఆకాశాన్ని చీల్చుకుంటూ ప్రయాణిస్తూనే వున్నాయి.